ద్వితీయ బహుమతి పొందిన కథానిక :

# నేస్తం

—కుమారి పి.వి. అన్నపూర్ణ

"ఒరే గోపీ యిలారా. నిన్నిలా గోలీలాడద్దని ఎన్నిసార్లు చెప్పాను, సిగ్గులేని వెధవా. మనిషికొక మాట, గొడ్డుకొక దెబ్బ. ఏమాట వినిపించుకోనే వినిపించుకోవు. ఇందుకేనా నిన్ను మీ అమ్మ యిక్కడికి పంపించింది. పన్నెండేళ్ళ వెధవ్వికదా ఆ మాత్రం బాధ్యత తెలీదూ, నాన్నపోయి కష్టాల్లో ఉన్నారుకదా! బుద్ధిగా చదువుకోఖర్లే" అంటూ రఘురామయ్యగారి కంఠం ఖంగున మోగేసరికి గోపీ భయపడి చేతిలో గోలీలు అక్కడే పడేసి మట్టికాళ్ళతో గబుక్కున లోపలికి పరుగెత్తాడు. రఘురామయ్య చాలా స్థితిమంతుడు. ఆయనకి ఒక్కగా నొక్క చెల్లెలు_ ఆవిడ కూడ బాగా బతికిన మనిషే. కాని పాపం ఆవిడభర్త ప్రమాద వశాత్తు మరణించాడు. ఆవిడ ఏకైక పుత్రుడే గోపి. తండ్రి పోవడం తోటి, గోపి అసలే అల్లరిచిల్లరగా తిరిగేవాడు కాస్తా యింకా పెత్రేగి పోయాడు. ఇంట్లోంచి దొంగతనంగా అవియివి తీసుకెళ్ళడం నేర్చుకున్నాడు. దాంతో భయపడి అన్నకి వుత్తరం రాసి, గోపిని అయన దగ్గరికి పంపేసిందావిడ. రఘురామయ్యకి మధు, లక్ష్మి యిద్దరే సంతానం. చెల్లెలి కొడుకునేదో కాస్త బాగుపరుద్దామని తన దగ్గర తెచ్చి పెట్టుకున్నాడు.

* * *

"గోపీ స్కూలుకు టైం అయిపోయిందిరా. ఇంకా ఎంత ఆలశ్యం చేస్తావు" అంటూ మధు తొందర చేశాడు. వస్తున్నాన్రా" అంటూనే ఆ గోలీలు సంచిలో పడేసుకుని అవియివి సర్దుతూ పదినిముషాలు ఆలశ్యం చేశాడు గోపి. ఇద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ స్కూలుకు వెళ్ళారు. క్లాసులో కెళ్ళి సీట్లలో కూర్చున్నారు. "ఒరే మధూ యింకా మాస్టారు రాలేదుగా! నేను కాసేపు ఆడుకుని వస్తానురా" అంటూ__ "ఒద్దురాబాబూ ఆ మాష్టారికసలే కోపం. ఎక్కడికివెళ్ళద్దురా"అని మధు బ్రతిమాలుతున్నా వినిపించుకోకుండా పరుగుతో వెళ్ళిపోయాడు గోపి. మధు_ గోపి వెళ్ళిన వైపే చూస్తూ కూర్చున్నాడు. తనుకూడ వెళ్దామనుకున్నాడు గాని, అమ్మ బాబోయ్ ఆ మాస్టారు చూశారంటే యింకేమన్నా వుందా! చంపెయ్యరూ? సాయంత్రం యింటికి పోతూ పోతూ నాన్నకి గనక చెప్పారంటే నాన్న తన ఒళ్లు చీరేస్తారు" అని భయపడుతూ అలాగే తన కుర్చీలో కూర్చున్నాడు. గోపి అక్కడ బయట మూగిన అల్లరి పిల్లలతో చేరి కాస్సేపు గోలీలాడాడు. వాళ్ళంతా అక్కడ వున్న జామచెట్లు ఎక్కి కాయలు కోస్తుంటే తనూ వాళ్ళని అనుసరించాడు. చెట్లెక్కి కాయలు కోసి క్రింద నిలబడ్డ వాళ్ళందరికి పందారం చేశాడు. అంతలోకే పెద్ద అరుపులు_ పిల్లలంతా గోలగా పరిగెత్తివెళ్ళిపోయారు. గోపీ కిందికి చూశాడు. అంతే గుండెల్లో రాయిపడ్డది. వాళ్ళ మాస్టారే. "బాబోయ్... ఎలా" అనుకొంటూ చెట్ల కొమ్మల్లో కనబడకుండా దాక్కోడానికి ప్రయత్నించాడు. "వెధవల్లారా చెట్లు చేమలెక్కడానికా మీరిక్కడికి వచ్చింది. దిగండి. వెధవ! నువ్వుకూడ ఇక్కడే వున్నావా దిగుతున్నావా లేదా" అంటూ గొంతు ఖంగున మోగించాడు. అంతే పిల్లలంతా దిగిపోయారు. గోపి కాలుగాలిన పిల్లిలా నెమ్మదిగా దిగి, తలవంచుకుని నిలబడ్డాడు. మాస్టారి కోపం శ్రుతి మించింది. ఆయన గోపి చెవి పట్టుకుని "వెధవా బుద్ధి

లేదుట్రా. హాయిగా చదువుకోక చెత్లెక్కడ మేమిటి? ఇలాంటి వెధవని మీ మామయ్య నా కంటగట్టాడు. నిన్నేదో మంచి దోవలోకి తెమ్మని "అంటూ ఆ కోపంలో ఆ చెంప ఈ చెంప వాయించాడు. దాంతో అందరు పిల్లలు కాళ్ళకి బుద్ధి చెప్పారు. అట్లాగే వాడి చెవ్వు పట్టుకొనే క్లాసులోకి తీసుకొచ్చాడు." చూడు ఆ మధుని చూసైనా బుద్ధి తెచ్చుకోరా! ఎందుకూ? ఇద్దరు కలిసి వస్తారు. కలిసి వెల్తారు. వాడి కాలి గోటికి కూడ పనికిరావు_ నీ తిక్క కుదరాలి "అంటూ అందరిముందు వాణ్ణి యిష్టం వచ్చినట్టు కొట్టాడు. ఇది చూసేటప్పటికి మధు కళ్ళు చెమర్చాయి_ "మాస్టారూ గోపీని కొట్టకండి పాపం వాళ్ళ నాన్నకూడ లేడు" అన్నాడు దిగులుగా. "అందుకేరా వీడికింత గట్టిగా చెప్పడం. అందరు వెధవలు తిరిగి, అల్లరి చేస్తారంటే వాళ్ళ పరిస్థితి వేరు. వీడు బాధ్యత లెరిగి ప్రవర్తించ వలసినవాడు కదా! వాళ్ళతో పాటు చేరి యిలా అల్లరిగా తిరిగితే వీడి గతేం కాను" అంటూ ఒక్క తోపు తోశాడు గోపిని కోపంగా. పడబోతున్న గోపిని మధు గట్టిగా పట్టుకుని "మాస్టారూ వాణ్ణేమి అనకండి. నేను నాన్నతో చెప్తానులెండి. ఈ సారినుంచీ యిలా చెయ్యడండీ" అని సర్ది చెప్పి గోపిని చెయ్యి పట్టుకొని తీసుకొచ్చి తన పక్కన కూర్చోపెట్టుకున్నాడు. "ఒరే గోపీ నీకు చెప్పలేదుట్రా మాష్టారు కోప్పడ్తారని. నువ్వు వినకుండా వెళ్తివి. ఇంకెప్పుడూ యిలా చెయ్యకురా" గోపి వంచిన తల ఎత్తలేదు. తగిలిన దెబ్బలు పాపం బాధ చేసినట్లున్నాయి. మధు అడ్డొచ్చాడు కాబట్టి సరిపోయింది లేకపోతే ఆయన ఏం చేసేవారో. పాపం మధు వట్టి పిచ్చివాడు_ అని గోపి ఏదో ఆలోచిస్తున్నాడు.

* * *

"మాస్టారూ నా పెన్ను కనబడ్డం లేదండి. ఇప్పుడే టేబుల్‌మీద పెట్టాను. నా నల్లపెన్ను ఏమయిందో ఏమో" అంటూ ఒక అబ్బాయి మాస్టారికి రిపోర్టిచ్చాడు.

"పిల్లలూ మీలో ఎవరైనా ఆ పెన్ను తీస్తే ఇచ్చేసేయండి లేకపోతే వూరుకునేది లేదు మీ వళ్ళు చీరేస్తాను. హెడ్‌మాస్టారితో చెప్పి డిస్‌మిస్ చేయిస్తాను" అన్నాడు పిల్లల్ని బెదిరిస్తూ. ఊహూ_ ఉలుకు లేదు, పలుకు లేదు. ఎవ్వరూ మాట్లాడలేదు. "మీపని యిట్లా ఉందా" అంటూ తలుపులన్నీ వేసి వచ్చి "ఊ .. తీయండి మీ సంచులు బయటపెట్టండి అవి ప్రతి ఒకళ్ళ సంచి తీసి సోదా చెయ్యడం మొదలు పెట్టారు. గోపీకింక భయం పుట్టింది. తన తప్పెలాగైనా తెలిసిపోతుంది. ఏం చేయాలో తోచలేదు. మెల్లిగా ఎవరు చూడకుండ పెన్ను సంచిలోంచి తీశాడు. మేష్టారు ఇంకా చాల ముందున్నారు. సంచులు సోదా చేస్తూ, మధు అటు, యిటు చూస్తున్నాడు. వీటితో తనకేం సంబంధం లేనట్లు. గబుక్కున ఆ పెన్ను తీసి మధు సంచిలో పడేశాడు గోపి. ఆ తొందరలో పెన్ను కొంచెం పైనుంచి వేయడంతో కొంచెం చప్పుడు చేస్తూ అది సంచిలో ప్రవేశించింది. మధు తల తిప్పాడు. గోపి సంచిలోంచి చేతులు తీస్తూ కనబడ్డాడు. సంచిలోకిచూస్తేనల్లగా నిగనిగలాడ్తూ పెన్ను. "ఓరే గోపి యిదేం అన్యాయంరా. ఆ పెన్ను తీసి నా సంచిలో పడేశావేంటి?" అన్నాడు దిగులుగా. "మధు ఊరుకోరా_ చెప్పకు మాస్టారు వచ్చేస్తున్నారు. నన్ను కాపాడరా. లేకపోతే ఆయన నన్ను నిలువునా చంపేస్తారు. నీ కాళ్ళు పట్టుకుంటారా మధూ" అంటూ బ్రతిమిలాడాడు గోపి. మధుకేం తోచలేదు. అలాగే స్థబ్దుగా నిలబడిపోయాడు. మాస్టారు వచ్చారు. గోపి సంచి తెరిచి చూశారు. "ఉహూ అందులోకూడ కనిపించ లేదు. మధు దగ్గరికి వచ్చారు. "వీడిదేం చూడాల్లే. వీడు అలాంటివాడు కాదు" అనుకుంటూ మధు సంచి లోకి చూశారు, విచిత్రం. అందులో నల్లని పెన్ను మెరుస్తూ కనబడింది. ప్రక్కనే వున్న ఆ అబ్బాయి నాదేనండి. ఈ పెన్ను నాదే. మధుగాడికెంత పొగరు నల్లిలాగ వుండీ నాపెన్ను కొత్త కొట్టేశాడు" అంటూ పెన్ను మాసారి చేతుల్లోంచి లాక్కుని సంతోషంగా అరుస్తూ వెళ్ళిపోయాడు. మాస్టారు నిచ్చేష్టులై నిల బడ్డారు. ఆయనకి ఒళ్ళు పై తెలీలేదు. "వెధవా నువ్వట్రా ఈ పని చేసి ది ఛీ... నువ్వు... మంచివాడివనుకున్నాను. భ్రష్టుడా నీకిదేం ఖర్మం" అంటూ యిష్టం వచ్చినట్లు బాదేశారు చెవులు మెలిపెడ్తూ. "పదరా వెధవా నిన్ను హెడ్‌మాస్టారి దగ్గరికి తీసుకెళ్ళి ఆయనతో చెప్పి డిస్‌మిస్ చేయిస్తాను. ఆగోపీగాడే నయం నీకంటే ఇలాంటి వెధవ బుద్ధులేవు వాడికి" అంటూ బరబర ఈడ్చుకెళ్ళాడు. మధు నీళ్ళు నిండిన కళ్ళతో

గోపీవంక చూశాడు. తను దొంగతనం చెయ్యలేదని, గోపీయే ఆ పెన్ను తీశాడని చెప్పలేక పోయాడు. ఏమన్నా వుందా, చెప్పానంటే గోపీని చంపేస్తారు. పాపం వాడికి నాన్నకూడా లేడు, అమ్మో వద్దు... చెప్పను.

గోపి కళ్ళల్లో దైన్యం ఉట్టిపడుతోంది. కాని తనే ఆ పని చేశానని చెప్పడానికి సాహసించలేకపోయాడు. మాస్టార్ని చూస్తుంటే భయం ముంచుకొస్తోంది.

* * *

"డాక్టరుగారూ! ఒక్కసారి చూడండి. ఏంజ్వరమో ఏమో నాలుగు రోజుల్నించి వీడు మూసిన కన్ను తెరవలేదు. అంటూ రఘురామయ్య దిగులుగా డాక్టరుతో చెప్తున్నాడు. డాక్టరు స్టెతస్కోపు పెట్టి చూశాడు. చాల సేపు పరీక్షించి యిది "టైఫాయిడ్ జ్వరం చాల తీవ్రంగా వుంది_ ఐస్ పెట్టండి. నే నింకో అర గంటలో వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు. గోపి మంచంమీద దిగులుగా కూర్చున్నాడు తనమూలంగానే మధుకి జర్వం వచ్చింది. వాడు నాకోసం దెబ్బలు తిన్నాడు. దెబ్బల బాధకి తట్టుకోలేక, నేనే ఆపెన్ను తీసినట్లు చెప్పేస్తాడేమో ననుకున్నా. వాడి దెంత మంచి మనస్సు. ఛీ...అలాంటివాణ్ని నేను కొట్టించాను. ఇది గోపీలోని బాధ. "రారా నువ్వన్నం తిందువుగాని" అని ఎంత బతిమాలినా గోపి మధు మంచం వదలక అక్కడే కూర్చునేవాడు. "నాకాకలి లేద త్తయ్యా" అని ముభావంగా జవాబిచ్చి రెండు కాళ్ళ మధ్య తలపెట్టుకొని దిగులుగా కూర్చునేవాడు. మధు నిద్రలో ఒకటేకలవరింతలు. "నేను... తి...య్యా...లేదు...రా : పెన్ను...నేను తీయలేదు. నువ్వన్నా చెప్పరా...గో...పీ...నేను తీ...శాన్రా" అంటూ ఏవో కలవరింతలు. వాడలా కలవరించినప్పుడల్లా గోపి వులిక్కిపడుతున్నాడు. మామయ్య యీ మాటలు ఎక్కడ వింటాడోనని భయం వక ప్రక్క. ఇంతలోకే రఘురామయ్య రానే వచ్చాడు. "ఏమిట్రా గోపీ మధు కలవరిస్తున్నాడు. పెన్ను... అంటాడేమిటి? నీకేమన్నా తెలుసా". "మామయ్యా" అంటూ పెద్దగాఅరిచాడు గోపి. "చెప్తాను మామయ్యా! నేనన్నీ చెప్తాను. నన్ను కొట్టవు కదూ! క్లాసులో నేను ఒకబ్బాయి పెన్ను దొంగతనంగా తీసుకొన్నాను. మామయ్యా. అది మేస్టారు చూస్తారేమోనని మధు సంచిలో పడేశాను. మేస్టారేమో వాణ్ని చచ్చేట్టు కొట్టారు. మామయ్యా! నావల్లే మధుకి జ్వరం వచ్చింది. నేనే యిదంతా చేసింది" అని గుక్క తిప్పుకోకుండ అన్నీ ఏకరువు పెట్టాడు ఏడుస్తూనే. రఘురామయ్యకి పట్టలేని కోపం వచ్చింది. కాని కోపాన్ని దిగమింగి పోనీ లేరా వూరుకో ఏడవకు. భయం లేదు. మధుకితగ్గిపోతుందిలే. వెళ్లు. నువ్వన్నం తినేసిరా" అంటూ వాణ్ని సముదాయించారు. అర గంట దాటింది. డాక్టరు వచ్చాడు. మధు కలవరింతలు ఆగిపోయాయి. డాక్టరు మళ్ళీ పరీక్ష చేశాడు. జ్వర తీవ్రత హెచ్చుగా వుంది. కళ్లు మూతలు పడ్తున్నాయి. కళ్లు తెరచినప్పుడల్లా కళ్ళలో ఎర్రటి కుదపలు కనబడుతున్నాయి. డాక్టరు కొంచెం సేపాలోచించి తనబ్యాగు తెరచిఅందులోంచి రెండు మాత్రలు తీసి యిచ్చాడు. అవి వేసి నోట్లో నీళ్లు పోశారు. కొద్దిగా గుటకలు వేశాడు. కాని మిగిలిన నీళ్లు నోట్లోంచి బయటికి వచ్చేశాయి. డాక్టరు తనింకేమి చేసేది లేదన్నట్లు "నే వెళ్తానంటూ బ్యాగు సర్దుకుని నిలడ్డాడు. రఘురామయ్య ఆయన వెనకాలే వెళ్ళాడు. "డాక్టర్ అలా వెళ్తారేమండీ. మీరు కూడ అలా వదిలేసి వెళ్ళితే ఎలాగండి. ఏం చేయమంటారో చెప్పండి" అంటూ కాళ్ళ వేళ్ళ పడ్డాడు. గోపీ కూడ మామయ్య వెనకాలే వెళ్ళి "డాక్టరుగారూ! మా మధు బాబు బతకాలి. నా మూలానే వాడికింత జ్వరం వచ్చింది. తొందరగా నయం చెయ్యండి" అంటూ ఏడ్చాడు. "నేనేం చేసేది లేదు. "హేమరైజ్" కేసు. మన చేతుల్లో ఏం లేదు. టైం దాటిపోయింది. రక్తపు కుదపలు కూడ వచ్చేశాయి. క్రమంగా అన్ని కదలికలు తగ్గుతున్నాయి" అన్నాడు దృఢంగా. "డాక్టరుగారూ! ఒక్కసారి చూడండి. ప్లీజ్... డాక్టర్ ఒళ్లు కాస్త వేడిగా వున్నట్టుందండి. రండి ఒక్కసారి చూడండి" అని ప్రాధేయ పడ్డాడు రఘురామయ్య. "చూసేదేం లేదయ్యా అంతా అయిపోయింది. ప్రాణం పోయింది కూడ. ఇంక నేను చూసేదేముంది" అంటూ భారంగా అడుగులు వేస్తూ ముందుకు నడిచాడు డాక్టర్. గోపికిప్పుడర్థమైంది. మధు ప్రశాంతంగా పడుకునివున్నాడు. గోపీ ఆ శరీరం మీద పడి "ఒరే మధూ నేనేరా నిన్ను చంపింది. నా

వల్లే నీకింత జ్వరం వచ్చింది. ఇంక నువ్వు రానే రావా. దూరంగా వెళ్ళిపోయావా. నేనొక్కణ్ణి ఎలా ఉండనురా. నన్ను కూడ తీసుకెళ్ళక పోయావా నీతో" అంటూ వక్కచే పెట్టున రోదించాడు. మధు తల్లి దుఃఖం చెప్పనలవి కాదు. గోపిని చూస్తుంటే గుండె లవిసి పోతున్నాయి. "లే గోపి ఏడవకు. ఏంచేస్తాం. మనకదృష్టంలేదు. ఊరుకో. ఇదంతా నా కర్మ. ఇది చూడడానికే నేనింకా బ్రతికున్నాను" అంటూ కళ్ళ వత్తుకుంది రఘురామయ్య జీవం లేని మనిషిలా కుర్చీలో కూలబడిపోయాడు.

* * * *

"గోపి విన్నేమ్రా ఈ లోకంలో ఉన్నావట్రా. స్కూలుకు పోవడంమానేస్తే మానేశావు. కా సఅన్నమన్నా ఎంగిలిపడరా. ఇదేం ధోరణిరా బాబూ" అంటూ అత్తయ్య గోపిని పిలిచింది. ఊఊ... గోపికి అదేం వినిపించడం లేదు. వాడి లోకంలో వాడున్నాడు. తను పెన్ను తీయడం, సంచిలో పడేయడం, మధుని మాష్టారు కొట్టడం_ యివే కళ్ళల్లో మెదుల్తున్నాయి. ఎదురుగుండా ఎవరో పిల్లలు గోలీలాడుకుంటున్నారు. లక్ష్మి, యింకా చాలామంది పిల్లలు చింతగింజలాడుకుంటున్నారు. గోపీవాళ్ళందరివంక తదేకంగా చూస్తున్నాడు. ఇంక మధులేడు. అంటే తనకి తోడు లేడు, మధువుంటే తను, మధు ఎంచక్కా ఆడుకునేవాళ్ళు. వాడికేం నన్నొక్కణ్ణి వదిలేసి వెళ్ళిపోయాడు. అది తలచుకుంటేనే గోపి కళ్ళ వెంబడి నీళ్ళు ధారగా కారాయి. అత్తయ్య చూసి కోప్పడుతుందేమోనని గబగబ కళ్ళు తుడుచుకున్నాడు. గోలీలాడ్తున్న పిల్లలు గోపికేసి చూశారు. "ఏమోయ్ నువ్వుకూడ రా! ఆడుకుందాం. నిన్నుకూడ ఆడిస్తాంలే" అంటూ గోపి తనని ఆడించుకోలేదని ఏడుస్తున్నాడనుకుని, జాలిగా చూస్తూ అతన్ని ఆటకి పిలిచారు. "ఉహూ... నేను రాను నాకు ఆడాలని లేదు" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు గోపి.

గోపికెంత సేపటికి మధు స్మృతులే. మధుతోడిదే అతని లోకం.మధులేని జీవితం చీకటిమయంగా కనిపించింది. ఇద్దరు ఒక్కటిగా తిరిగేవాళ్ళు మధు లేకపోతే తనకి ఒక్కక్షణం తోచదు స్కూలుకుకూడ యిద్దరు కలిసే వెళ్లేవాళ్ళు. గోపీకిప్పుడు స్కూలుకుకూడవెళ్ళాలని లేదు. బొత్తిగా బడి, చదువు మానేశాడు. ఏం చెప్పినా వినిపించుకోడు. ఉలకడు, పలకడు, ఎప్పుడూ ఏవో ఆలోచిస్తూ ఉంటాడు. తండ్రిలేని బిడ్డ, ఏదో చదువుకుంటాడని తీసుకొస్తే యిలా బెంగపడిపోయాడు. వారికి గోపి విషయం ఏంచేయాలో ఏం తోచలేదు. మధు చావుతో మర సలే దిగులుపడిపోయాడు.

మధు పోయాడని తెలిసి గోపి తల్లి అన్నయ్యని పరామర్శించడానికి వచ్చింది. మనస్సు బాగాలేదని, చెల్లెల్ని తనదగ్గరే వుంచుకున్నాడు రఘురామయ్యగారు. కాదనలేక ఆవిడ అక్కడే ఉండిపోయింది. గోపి ధోరణి ఆవిడకికూడ వింతగావుంది. పాపం ఒక్కటిగా పెరిగారు పిల్లలిద్దరూ. మనస్సులో ఏముందోగాని గోపి ఒక్కటీ బయటకి చెప్పడు.తనలో తనే బాధపడ్తాడు. వాళ్ళింట్లో ఒక బొమ్మ ఉండేది. గోపి, మధు యిద్దరూ దాంతో ఆడుకునేవారు దాన్ని చూసినప్పుడల్లా, గోపికి మధు జ్ఞాపకంవచ్చేవాడు. మధుకి అదంటే ప్రాణం. నిముషంకూడ వదిలేవాడు కాదు. ఇప్పుడు గోపి దాన్తోఏవో మాట్లాడుతాడు."నీకేం తెలుసురా! మా మధు ఎంత మంచాడనుకున్నావు. వాణ్ణి నేను దెబ్బలుకొట్టించాను. ఎంత నెప్పెట్టిందో వాడికి" అంటూ ఏదో పిచ్చిగా బాధపడేవాడు. పిచ్చి గోపి. మధు చచ్చిపోయినా ఆనీడ మాత్రం గోపీనంటిపెట్టుకునే వుంది. వారిద్దరి మధ్యనున్న మమతాను బంధమలాంటిది. ముక్కు మొహం తెలియని అమాయకమైన వయస్సులో మమత వారిద్దరిమధ్య లతలాఅల్లుకుని పెనవేసుకుని పోయింది. ఒకరు లత అయితే మరొకరు దానికాధారం. ఆ ఆధారమే కూలినప్పుడింక లతకి తావేది? అదీ కూలిపోయింది. జీవంవున్నా నిరాధారం కావడంచేత ఏపుగా పెరగలేక, చావు బ్రతుకుల మధ్య వూగిసలాడుతోంది. విధి వక్రించి, జీవితంలో వేసిన ముద్ర శాశ్వతమై నిలిచి ఊపిరున్నంతవరకూ గోపీని బాధిస్తునే వుంది.

** ** **